క్లుప్తంగా

ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన స్వగ్రామం తామరతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తామర, తీమర, పెద్దసీది, పాశిగంగుపేట గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ర్యాలీలో తూలుగు తిరుపతిరావు, సలాన చిరంజీవి, అనపాన రాజశేఖర్‌రెడ్డి, వెలమల గోవిందరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


సత్సంగంలో పాల్గొన్న వక్తలు, భక్తులు

సరుబుజ్జిలి: ఆధ్యాత్మిక చింతన దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని రొట్టవలస శ్రీరామానంద ఆశ్రమం వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామిజీ తెలిపారు. ఆశ్రమం ఆవరణలో ఆదివారం భక్తులతో సత్సంగం నిర్వహించారు. హనుమాన్‌చాలీసా, సుందరకాండ, రామాయణాన్ని పారాయణం చేశారు. అనంతరం నారాయణసేవ, ప్రసాదవితరణ చేపట్టారు. ఈ సత్సంగంలో భక్తులు అప్పలనాయుడు, శ్రీరాములు తదితరులు పానల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ


యంబరాంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాధులు, యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు అన్నారు. మండలంలోని యంబరాం, కరకవలస, బొత్తాడసింగి, పెద్దకొల్లివలస గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఆదివారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ ఆర్బీకేలో ఇప్పటికే పేర్లు నమోదు చేసుకుని డబ్బులు చెల్లించిన రైతులకు విత్తనాలు అందించారన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్దకొల్లివలస సర్పంచ్ రావాడ రాజేశ్వరి, ఎంపీటీసీ ఎం.తవిటమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి పంచాయతీ పరిధి చినషళంత్రి గ్రామంలో సర్పంచ్ బత్తిని వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించి, గ్రామానికి దూరంగా ట్రాక్టర్లతో తరలించారు. బోర్లు, నేలబావుల వద్ద ఈగలు, దోమలు చేరకుండా బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అదపాక గౌరినాయుడు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే రమణమూర్తికి సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీపీ, ఉద్యోగులు

సారవకోట: మండల పరిషత్ సమావేశ మందిరంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా ఎన్నికై న అనంతరం మొదటి సారిగా మండలానికి రావడంతో మండల పరిషత్ ఉద్యోగులు, తహసీల్దార్, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎంపీపీని కూడా ఈ సందర్భంగా అన్ని శాఖల ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి ఆదివారం తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు వాహన పూజలు చేశారు.
- పాతపట్నం

చల్లదనం



నరసన్నపేట మండలంలోని జమ్ము గ్రామంలో గల పాతపట్నం అమ్మవారి గుడి వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ముర్రాటలు సమర్పించి అమ్మవారికి చల్లదనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి గుడి వద్ద సందడి నెలకొంది.
- నరసన్నపేట

సత్కారం



రక్తదానం, రక్త సేకరణ తదితర అంశాలపై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నరసన్నపేట మండలంలోని బొరిగివలసకు చెందిన కలాం నంద వెల్ఫేర్ సొసైటీకి ప్రశంసాపత్రం లభించింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సొసైటీ సభ్యులు కోటిపల్లి జగదీష్, కుంచి నరేంద్రలకు జేసీ కె.మయూర్ అశోక్ ప్రశంసాపత్రం అందించారు. సొసైటీ అధ్యక్షుడు పాగోటి రాంబాబు మాట్లాడుతూ ప్రజల్లో రక్తదానంపై మరింతగా అవగాహన కల్పిస్తామన్నారు.
- నరసన్నపేట

సాగునీరు అందేలా చర్యలు తీసుకోండి


అధికారులను ప్రశ్నిస్తున్న బుడితి ఎంపీటీసీ మురళి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సారవకోట: ఖరీఫ్‌లో పంట పొలాలకు సాగు నీరందించేందుకు కాలువల్లో పూడికలు తీసి తగిన చర్యలు తీసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, సాగు నీరందించేందుకు చిన్న, చిన్న కాలువల్లో పూడికలు తొలగించేందుకు వంశధార, చిన్న నీటిపారుదల ఇంజినీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్మీపురం సమీపంలో 18–ఆర్ కాలువ ఎక్కువగా ఆక్రమణలకు గురైందని, రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని నీటి పారుదల శాఖాధికారులు వాటిని పరిశీలించి ఆక్రమణలు తొలగించాలన్నారు.

వేతనం తక్కువగా వస్తుంది..

ఉపాధి పథకం ద్వారా పనిచేసిన వేతనదారులకు ప్రభుత్వం రూ.299 చెల్లించాలని చెబుతుందని, స్థానికంగా వేతనాలు తక్కువగా వస్తున్నాయని బుడితి ఎంపీటీసీ మురళి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్నుపురం పంచాయతీలో సర్పంచ్ తీర్మానం లేకుండా పనులు గుర్తించారని సర్పంచ్ భీమారావు ఆరోపించారు. బద్రి పంచాయతీలో బద్రి, గోపినాథపురం గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారని, ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని ఎంపీటీసీ మెండ బాలచంద్రరావునాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. వంశధార ఎడమ కాలువపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో బైదాలాపురం గ్రామానికి రాకపోకలు ఇబ్బందిగా ఉందని, వెంతనను పునర్ నిర్మించాలని కోరారు.

బొంతు ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలి..

బొంతు ఎత్తిపోతల పథకం పనులు 78 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలన పనులు ప్రారంభించేలా చూడాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు కోరారు. వచ్చే మండల సర్వసభ్య సమావేశం నాటికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని, వారం రోజులు ముందుగా ఎమ్మెల్యేకు ప్రగతి నివేదిక అందించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎద్ల అసిరయ్య, ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ భాగ్యవతి, ఈఓపీఆర్డీ రేణుక, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామ సేవే.. రామ సేవ

ఆమదాలవలస: గ్రామ సేవే.. రామ సేవ అని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు అన్నారు. ఆమదాలవలస జోన్ పరిధిలో ఉన్న దివంజిపేట గ్రామంలో ఆమదాలవలస సమితి (మెట్టక్కివలస) సారధ్యంలో జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన గ్రామ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 90 మంది రోగులకు పరీక్షలు చేపట్టి మందుల పంపిణీ చేశారు. స్కిల్ డవలప్‌మెంట్‌పై యువకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థల స్కిల్ డవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయన నరసింహమూర్తి, జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు, దంత వైద్యులు కార్తీక్, గ్రామసేవ ఇన్‌చార్జి బి.దామోదర్ పటాన్నయక్, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జి గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న రామచంద్రరావు, తదితరులు

ప్రభుత్వ స్థలం ఆక్రమణ


ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం


మహిళా మార్ట్ పక్కన వేసిన రేకుల షెడ్

నరసన్నపేట: స్థానిక పాతబస్టాండ్ వద్ద ఆర్అండ్‌బీ రహదారికి ఆనుకుని మండల పరిషత్‌కు చెందిన స్థలం ఆక్రమణలకు గురైంది. మహిళా మార్ట్‌కు, మండల పరిషత్ దుకాణాలకు మధ్య ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమణదారులు ఆదివారం దుకాణాలు, రేకుల షెడ్‌లు వేశారు. ఈ స్థలంలో మండల పరిషత్ ఆధ్వర్యంలో దుకాణాల నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి.

ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆక్రమణలపై పంచాయతీ ఈఓ చిన్నారావు వద్ద ప్రస్తావించగా ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పనులు ఆపమని తెలియజేశామన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

పాతపట్నం: ఈ నెల 17వ తేదీన మండలంలోని కాగువాడ గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఉన్న భగవాన్ సత్యసాయి సేవా సమితి భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు శంకర్ ఫౌండేషన్ ఏరియా కో ఆర్డినేటర్ కె.రామారావు ఆదివారం తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని కాగువాడ, కొరసవాడ, బూరగాం పరిసర ప్రాంతాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ బిల్లు కౌంటర్ ఏర్పాటు

హిరమండలం: హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కౌంటర్‌ను సోమవారం నుంచి తెరవనున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉండే విద్యుత్ బిల్లు కౌంటర్ పలు అనివార్య కారణాల వల్ల మూసివేయడం జరిగిందన్నారు. మరలా ప్రజల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

19న నీలమణిదుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 19వ తేదీన ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ హుండీని లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్ పాటించి, లెక్కింపునకు హాజరుకావాలన్నారు.

కాలభైరవస్వామికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాలా త్రిపుర కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో ఆదివారం సందర్భంగా కాలభైరవస్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామివారిని స్వర్ణాకర్షక భైరవ స్వామిగా అలంకరించి హారతి ఇచ్చారు.


కాలభైరవస్వామికి హారతి ఇస్తున్న దృశ్యం

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి


వెంకటేశ్వరరావు, ఏఈ, హిరమండలం

హిరమండలం: ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హిరమండలం విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరరావు సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా వర్షం కురిస్తే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో చెట్ల కిందకు వెళ్లకూడదన్నారు. గాలులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు చాలామంది వర్షం కురిస్తే చెట్ల కిందకు వెళ్తుంటారని, అలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు. చిన్నపాటి వర్షం ప్రారంభం కాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

ఇళ్లల్లో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులు నుంచి ప్లెగ్‌లు తీసివేయాలన్నారు. టీవీలు, సెల్ ఫోన్లు చూడొద్దన్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఉండకూడదన్నారు. విద్యుత్ స్తంభాలను తాకితే షాక్ తగిలే ప్రమాదం ఉందన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి రెడ్డి కిల్లిపాలెం వ్యాస్తవ్యులు సింహాద్రి అప్పలరామేశ్వరం, కుమారుడు వెంకట రమణ మూర్తి, జ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఆదివారం అందజేశారు. తన తల్లి సింహాద్రి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లుగా కుమారుడు రమణమూర్తి ప్రకటించారు. ఈమేరకు చెక్‌ను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, రిటైర్డ్ ఇంజినీర్ నక్క శంకరరావు పాల్గొన్నారు.


చెక్కును ఈవో చంద్రశేఖర్‌కు అందజేస్తున్న దాతలు

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న డీఎఫ్‌వోలు


డీఎఫ్‌వోలకు క్షేత్ర ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో గురునాథం

గార: కూర్మక్షేత్ర శ్రీకూర్మనాథున్ని శ్రీకాకుళం, మన్యం జిల్లాల డీఎఫ్‌వోలు వెంకటేష్, ప్రసూనలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్లపార్కు, రెండు ధ్వజ స్తంభాలను సందర్శించారు. ఆలయ ఈవో జి.గురునాథం, కిషోర్‌బాబులు క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.

వేంకటేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం


బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో కల్యాణోత్సవం


చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామికి కల్యాణ పూజలు


మొండేటివీధిలోని శివకామేశ్వరస్వామికి సహస్ర లింగార్చనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధనలు, ధ్వజారోహణం, మహానివేదన, నిరాజనం, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ జరిగింది. సోమవారం ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణ వేడుకలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాధవి, గీతా సత్సంగం సభ్యులు పాల్గొన్నారు.

శివబాలజీ ఆలయంలో..

బ్యాంకర్స్‌కాలనీలోని శివబాలాజీ ఆలయంలో అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో వేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా హోమాలు, విశ్వక్సేనారాధన , మండపారాధనలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు తులసీరావు, సామంత్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సహస్ర లింగార్చనలు

మొండేటివీధిలోని లలితాదేవి సహిత శివకామేశ్వర స్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సహస్రలింగార్చనలు ఆదివారం జరిగాయి. షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శివకామేశ్వరునికి విశిష్ట సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి.

చిన్నారులకు పలు పోటీలు


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు గేమ్స్, మోనో ఎక్షన్, మెమొరీ గేమ్ పోటీలు ఆదివారం జరిగాయి. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. చిన్నారి నందు రావన నృత్యంతో అలరించింది.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, నిక్కు హరిసత్యం, ప్రసాద్, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత


నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులు

గార: ఇటీవల విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మండలస్థాయిలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులను ఆదివారం అందజేశారు. శ్రీకూర్మం జంక్షన్‌లోని కల్యాణ మంటపంలో ఫాదర్స్ డే సందర్భంగా బీవీఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి తొమ్మిది మందికి నగదుతో పాటు పతకాలను అందజేశారు. ఫౌండర్ బలివాడ రేణుకదేవి, ప్రెసిడెంట్ బలివాడ దుర్గాప్రసాద్, జేసీసీ అధ్యక్షులు కర్రి అశోక్‌కుమార్, మండల శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షులు బలివాడ రాధాకృష్ణ, హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్, విశ్రాంత హెచ్ఎం నవీన చంద్రుడు, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమా రుద్రకోటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈశ్వరుని వాహనమైన నంది జెండాను అవరోహణ చేసి పూజలు చేశారు. సోమవారం శివపార్వతుల కల్యాణం, స్వామివారిని సర్పవాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు